


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510



నంద్యాల ఆటోనగర్ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.





Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 288 పేజీలు - 08 వెల - 05/- బుధవారం 14-10-2026


# ఎన్నికల కమిషనర్ల రక్షణపై సుప్రీంకోర్టు నోటీసులు!




**ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణపై సుప్రీంకోర్టు నోటీసులు**

- కేంద్రం, ఎన్నికల సంఘం సమాధానాలు ఇవ్వాలని ఆదేశం
- తదుపరి విచారణ నవంబర్ 2న జరిగే అవకాశం
- 2023 చట్టంలోని సెక్షన్ 16ను సవాల్ చేసిన ఏడీఆర్
- రక్షణ వల్ల జవాబుదారీతనం తగ్గుతుందని ఏడీఆర్ వాదన

*ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు చట్టం ద్వారా కల్పించిన విస్తృత న్యాయపరమైన రక్షణను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈ రక్షణ రాజ్యాంగంలోని సమానత్వ హక్కు, భావప్రకటన స్వేచ్ఛకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధమని 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) తన పిటిషన్‌లో పేర్కొంది.*

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై స్పందించింది. కేంద్రం, ఎన్నికల సంఘం తమ సమాధానాలను సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 2న చేపట్టే అవకాశం ఉంది.

**అసలు వివాదం ఏంటి?**

2023లో తీసుకొచ్చిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలోని సెక్షన్ 16 ఈ వివాదానికి కేంద్రంగా ఉంది. ఈ నిబంధన ప్రకారం.. ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా లేదా ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన వ్యక్తి, తన అధికారిక విధుల నిర్వహణలో లేదా విధులు నిర్వహిస్తున్నట్లు

మిగతా 2లో

## చెన్నైకి తాగునీరు ఇవ్వండి

- ఉండవల్లిలో ఏపీ, తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశం
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చించిన చంద్రబాబు
- నీటి లభ్యతను బట్టి సాయం చేస్తామని చంద్రబాబు హామీ
- ఇప్పటికే చెన్నైకి 4.08 టీఎంసీలు విడుదల చేశామని వెల్లడి



తమ రాష్ట్ర రాజధాని చెన్నై నగరం ఎదుర్కొంటున్న తీవ్ర తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తెలుగు గంగ ద్వారా అదనపు జలాలను విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన, మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఇరు రాష్ట్రాల మధ్య

మిగతాది 2లో

## ట్రంప్ ఆసియా పర్యటనలో సర్‌ప్రైజ్? కిమ్‌తో భేటీపై సంకేతాలు!

- కిమ్‌తో భేటీ అవకాశాన్ని తోసిపుచ్చని ట్రంప్
- నవంబరు 16న మనీలాలో ఆసియాన్ సదస్సుకు ట్రంప్ హాజరు
- నవంబరు 17-19 తేదీల్లో షెన్‌జెన్‌లో ఏపీఈసీ సదస్సు
- చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోనూ ట్రంప్ సమావేశం
- కిమ్‌తో భేటీపై ఇరు దేశాల నుంచి లేని అధికారిక ప్రకటన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మరోసారి సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే నెలలో ఆసియా పర్యటనకు వెళ్లనున్న ట్రంప్.. కిమ్‌తో భేటీ అయ్యే అంశాన్ని తోసిపుచ్చలేదు. అయితే, సమావేశంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

**ఆసియా పర్యటనలో కీలక భేటీలు**



వచ్చే నెల 16న ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగే ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో ట్రంప్ పాల్గొననున్నారు.

మిగతాది 2లో

## విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర: కిషన్ రెడ్డి

- కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని కిషన్ రెడ్డి ఆరోపణ
- వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
- పండుగ సీజన్‌లో చిన్న వ్యాపారులను నష్టపరుస్తున్నారన్న కేంద్రమంత్రి




దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.

## ఆత్మకూరులో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం.

**ఆర్థిక ఇబ్బందులతో ఏ కుటుంబానికీ వైద్యం ఆగకూడదు**

- పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా
- రెండేళ్లలో 1,150 కుటుంబాలకు రూ.10.42 కోట్లకు పైగా సాయం



నెల్లూరు, అక్టోబర్ 13: అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకుని ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. పేదల ఆరోగ్య భద్రతకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన బైపాస్ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా

మిగతాది 2లో

## దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది

**విజయవాడ ఉత్సవాల వేదికగా గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రకటన**

- బెజవాడలో విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమం
- ఒకే వేదికపై ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్
- యువత ఉత్సాహాన్ని చూసి పులకించిన చంద్రబాబు
- ప్రధాని మోదీ నాయకత్వంలోనే ఐదు నదుల అనుసంధానం సాధ్యమని వెల్లడి
- యువత ఉత్సాహం చూస్తుంటే 2047 నాటికి భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుందని ధీమా



తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రాకతో విజయవాడ నగరం దద్దరిల్లిపోతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన 'విజయవాడ ఉత్సవ్ 2.0' సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్‌తో కలిసి ఆయన వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు ఉద్విగ్నంగా ప్రసంగించారు. దుర్గమ్మ, భారత్ మాత, తెలుగు తల్లికి జయజయధ్వానాలు పలుకుతూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన, సభకు హాజరైన యువత ఉత్సాహాన్ని చూసి పులకించిపోయారు. "విజయ్ రాకతో మీ ఉత్సాహం చూస్తుంటే విజయవాడ దద్దరిల్లిపోతోంది" అంటూ సభికులను ఉత్తేజపరిచారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దళపతి విజయ్ మొట్టమొదటిసారిగా మరో రాష్ట్రానికి వచ్చారని, ఆ గడ్డ పవిత్రమైన విజయవాడ కావడం, దుర్గమ్మ తల్లే ఆయన్ను ఇక్కడికి పిలిపించడం సంతోషంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. తమిళనాడును అభివృద్ధి

మిగతాది 2లో




## హజ్--2027

**ఏర్పాట్లపై హసన్ బాషా కీలక భేటీ**

ముంబై, అక్టోబర్ 13:ముంబైలోని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జజూా) షానవాస్ సి. (ఌూూ) ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా మర్యాదపూర్వకంగా కలిసి, హజ్--2027కు సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో హజ్ యాత్రికులకు అవసరమైన సౌకర్యాల కల్పన, యాత్ర నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, సేవల మెరుగుదల, యాత్రికులకు

## కరెంట్, నీళ్లు ఇవ్వలేరు.. బుల్లెట్ ట్రైన్లా?: సబిత

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్ర విమర్శలు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ ఖరారు కాకుండానే భూసేకరణ చట్టవిరుద్ధమని ఆరోపణ
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేల ఎకరాలు బలవంతంగా లాక్కుంటున్నారని ధ్వజం



తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని

మిగతాది 2లో

## కేంద్రంపై అభిజిత్ దీప్కే తీవ్ర ఆరోపణలు!

- నిరసనల విషయంలో ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపణ
- ఉద్యమకారుల మధ్య అనుమానాలు సృష్టించి విడదీసే ప్రయత్నం
- తమ నిరసనపై ఉక్కుపాదం, ఇండియా కూటమి ర్యాలీకి అనుమతిపై విమర్శ
- కుట్ర సిద్ధాంతాలను నమ్మకుండా ఐక్యంగా ఉండాలని ఉద్యమకారుల పిలుపు




కేంద్ర ప్రభుత్వం నిరసనకారుల మధ్య విభేదాలు సృష్టించి, వారి ఐక్యతను దెబ్బతీసేందుకు 'విభజించి పాలించు' అనే కుట్రపూరిత వ్యూహాన్ని అమలు చేస్తోందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నియామకానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాన్ని నీరుగార్చేందుకు, వివిధ నిరసన బృందాల

మిగతాది 2లో

# దళపతి విజయ్ రాకతో విజయవాడ దద్దరిల్లింది

పేర్కొన్నారు. తమిళనాడును అభివృద్ధి చేయాలనే బలమైన పట్టుదలతో, కేవలం రెండేళ్లలోనే పార్టీ పెట్టి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి విజయ్ అని కొనియాడారు. ఆయన పట్టుదల, అంకితభావం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ కమిటీని ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు జాతీయ రాజకీయాలు, నదుల అనుసంధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. “రాష్ట్రాలు వేరు కావచ్చు, కానీ మా అందరి అభిమతం ఒకటే. భారతదేశం, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా అన్ని రాష్ట్రాలు బాగుండాలి” అని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమేనని చెబుతూ, గోదావరి-కావేరి నదుల అనుసంధానం త్వరలోనే జరుగుతుందని ప్రకటించారు. “దుర్గమ్మ తల్లి సాక్షిగా, మన విజయవాడ

నుంచే గోదావరి, కృష్ణమ్మ తల్లులు కలుస్తాయి. ఈ మహత్కార్యాన్ని నెరవేర్చగల ఏకైక నాయకుడు నరేంద్ర మోదీ” అని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గోదావరి, కృష్ణ, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులు అనుసంధానమై నాలుగు రాష్ట్రాలు సస్యశ్యామలం అవుతాయని వివరించారు.

వేదిక కింద ఉన్న యువతను, వారి ఉత్సాహాన్ని చూస్తుంటే భారతదేశ భవిష్యత్తుపై తనకు సంపూర్ణ విశ్వాసం కలుగుతోందని చంద్రబాబు అన్నారు. “టెక్నాలజీ, నాలెడ్జ్‌తో భారత యువత ప్రపంచంలో ఏదైనా సాధించగలదు. మీ ఉత్సాహం చూశాక, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

టెక్నాలజీ, నాలెడ్జ్‌కు ఆధ్యాత్మికతను జోడించి ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని, విజయవాడ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు ఆ ఆధ్యాత్మిక స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. అనంతరం, వెండితెరపై కోట్లాది మంది అభిమానాన్ని చూరగొని, ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ప్రసంగించవలసిందిగా చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు.

---

# ఎన్నికల కమిషనర్ల రక్షణపై సుప్రీంకోర్టు నోటీసులు!

భావించి చేసిన చర్యలు, మాట్లాడిన మాటలకు సంబంధించి ఆయనపై సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న అలాంటి కేసులను కూడా కొనసాగించకూడదని ఈ సెక్షన్ పేర్కొంటోంది. ఈ రక్షణ విధుల్లో ఉన్నవారికే కాకుండా, గతంలో ఆ పదవుల్లో పనిచేసినవారికీ వర్తిస్తుంది. అయితే, ఈ నిబంధన రాజ్యాంగబద్ధతనే ఏడీఆర్ సవాలు చేసింది.

### ఏడీఆర్ అభ్యంతరాలేంటి?

సెక్షన్ 16 రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లోని సమానత్వ హక్కు, ఆర్టికల్ 19లోని స్వేచ్ఛకు సంబంధించిన హక్కులను ఉల్లంఘిస్తోందని ఏడీఆర్ వాదిస్తోంది. ఎన్నికల కమిషనర్లకు ఇంత విస్తృత రక్షణ కల్పించడం వల్ల వారి చర్యలపై జవాబుదారీతనం తగ్గుతుందని పిటిషన్‌లో పేర్కొంది. అధికార దుర్వినియోగం లేదా అవినీతికి సంబంధించిన ఆరోపణలపై న్యాయపరమైన పరిశీలనకు అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేసింది.

### ఎన్నికల సంఘం అధికారాలపైనా మరో పిటిషన్

ఎన్నికల సంఘం పనితీరు, దాని అధికారాల వినియోగంపై కూడా సుప్రీంకోర్టులో వేర్వేరు పిటిషన్లు విచారణకు వస్తున్నాయి. ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘానికి చెందిన అధికారాలను వ్యక్తిగతంగా వినియోగించగలరా లేదా ఆ సంస్థ తరఫున ఏకపక్షంగా వ్యవహరించగలరా అనే అంశంపై దాఖలైన మరో పిటిషన్‌పై కూడా అక్టోబర్ 5న ధర్మాసనం కేంద్రానికి, ఎన్నికల సంఘానికి, ముగ్గురు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల నిర్వహణపై పర్యవేక్షణ, ఆదేశాలు, నియంత్రణాధికారాలు ఎన్నికల సంఘం అనే సంస్థకు ఉంటాయని పిటిషనర్ వాదించారు. ఈ అధికారాలను సీఈసీ ఒక్కరే వినియోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపైనా సుప్రీంకోర్టు స్పందన కోరింది.

### సీఈసీ నియామక చట్టంపైనా భేదాభిప్రాయం

2023 చట్టంలో సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపైనా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.

సెప్టెంబర్ 23న ఈ అంశంపై విచారణ జరిపిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనానికి పంపాల్సిన అవసరం లేదని అభిప్రాయపడగా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఇందులో రాజ్యాంగపరమైన కీలక ప్రశ్నలు ఉన్నాయని పేర్కొని విస్తృత ధర్మాసనానికి పంపాలని సూచించారు.

దీంతో ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా వద్దా అనే విషయాన్ని పరిశీలించేందుకు కేసు పత్రాలను సీజేఐ సూర్యకాంత్ ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తులు ఆదేశించారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న 2023 చట్టం ప్రకారం, నియామక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రివర్గ సభ్యుడు ఉంటారు. అంతకుముందు, 2023 మార్చిలో అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఏర్పాటులో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలని పేర్కొంది.

ఎన్నికల కమిషనర్లకు కల్పించిన న్యాయపరమైన రక్షణ, వారి అధికారాల వినియోగం, నియామక విధానం వంటి అంశాలు ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నాయి. ఈ పిటిషన్లపై వెలువడే తీర్పులు ఎన్నికల సంఘం స్వతంత్రత, జవాబుదారీతనానికి సంబంధించిన చర్చలో కీలకంగా మారనున్నాయి.

# ట్రంప్ ఆసియా పర్యటనలో సర్‌ప్రైజ్? కిమ్‌తో భేటీపై సంకేతాలు!

అనంతరం చైనాలోని షెన్‌జెన్‌లో నవంబరు 17 నుంచి 19 వరకు జరిగే ఏపీఈసీ సదస్సుకు హాజరవుతారు. ఈ పర్యటనలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోనూ ట్రంప్ సమావేశం కానున్నారు. ఈ ఏడాదిలో వీరిద్దరూ భేటీ కావడం ఇది మూడోసారి కానుంది.

### కిమ్‌తో భేటీపై ఏమన్నారంటే?

కిమ్‌తో సమావేశమయ్యే అవకాశం ఉందా? అని వైట్‌హౌస్ వద్ద విలేకరులు ప్రశ్నించగా.. ‘అవును, ఉండొచ్చు’ అని ట్రంప్ బదులిచ్చారు. అయితే, ఎక్కడ? ఎప్పుడు? భేటీ జరిగే అవకాశం ఉందనే విషయాన్ని వెల్లడించలేదు. ఈ ఏడాది చివర్లో కిమ్‌ను కలుస్తానని ట్రంప్ గత ఆగస్టులోనూ చెప్పారు. షెన్‌జెన్‌లో జరిగే ఏపీఈసీ సదస్సు సందర్భంగా ఈ భేటీకి ఏర్పాట్లు చేయాలని ట్రంప్ తన సహాయకులను కోరినట్లు ఆగస్టులో ‘వాల్‌స్ట్రీట్ జర్నల్’ కథనం ప్రచురించింది. అయితే, ఇరు దేశాల ప్రభుత్వాల నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు.

### గతంలో మూడుసార్లు సమావేశం

ట్రంప్ తొలి పదవీకాలంలో కిమ్‌తో మూడుసార్లు సమావేశమయ్యారు. 2018 జూన్‌లో సింగపూర్‌లో జరిగిన భేటీతో ఉత్తర కొరియా అధినేతను కలిసిన తొలి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ నిలిచారు. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వాయుధ రహిత ప్రాంతంగా మార్చేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. 2019 ఫిబ్రవరిలో వియత్నాంలోని హనోయ్‌లో జరిగిన రెండో సమావేశం ఒప్పందం లేకుండానే ముగిసింది. అదే ఏడాది జూన్‌లో పాన్‌మున్‌జోమ్ వద్ద సరిహద్దు ప్రాంతంలోకి అడుగుపెట్టి ఉత్తర కొరియా భూభాగంలోకి ప్రవేశించిన తొలి అమెరికా అధ్యక్షుడిగానూ ట్రంప్ చరిత్ర సృష్టించారు. ఆ తర్వాత చర్చలు నిలిచిపోయాయి. ఉత్తర కొరియా మాత్రం అణు, క్షిపణి కార్యక్రమాలను విస్తరిస్తూనే ఉంది.

# చెన్నైకి తాగునీరు ఇవ్వండి: చంద్రబాబును కోరిన సీఎం విజయ్

విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన





ఆయన, మంగళవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశంపైనే చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి విజయ్‌కు, ఆయన వెంట వచ్చిన అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో చెన్నై నగర తాగునీటి అవసరాలను తీర్చడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింతగా సహకరించాలని సీఎం విజయ్ అభ్యర్థించారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా నదిలో జలాల లభ్యత గణనీయంగా తగ్గి, ఏపీలోనే తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయినప్పటికీ, పొరుగు రాష్ట్ర దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఒప్పందం ప్రకారం చెన్నై నగరానికి 4.08 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు చంద్రబాబు వివరించారు. భవిష్యత్తులో ప్రాజెక్టులలో నీటి లభ్యత, అవసరాలను బేరీజు వేసుకుని, మరికొంత నీటిని విడుదల చేసే అంశాన్ని కచ్చితంగా పరిశీలిస్తామని ఆయన విజయ్‌కు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కరవు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు ఆవశ్యకతను చంద్రబాబు నొక్కి చెప్పారు. ఈ బృహత్తర పథకం రెండు రాష్ట్రాలకే కాకుండా దేశానికే మేలు చేస్తుందని ఆయన వివరించారు. ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పలు ద్వైపాక్షిక అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.

# కరెంట్, నీళ్లు ఇవ్వలేరు.. బుల్లెట్ ట్రైన్లా?: సబిత

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పంటలు వేయవద్దని సలహా ఇస్తోందని... కనీసం కరెంట్, సాగు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆమె విమర్శించారు. మెట్రో టెండర్లు రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి అవసరం ఏముందని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నాదర్‌గూల్‌లోని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, భూసేకరణ ఒత్తిడితో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

## హజ్--2027 ఏర్పాట్లపై హసన్ బాషా కీలక భేటీ!

(మొదటి పేజీ తరువాయి)

యాత్ర నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, సేవల మెరుగుదల, యాత్రికులకు మరింత మెరుగైన సహకారం అందించడం వంటి ముఖ్యమైన అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.హజ్ యాత్రికుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ, హజ్--2027 యాత్రను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలపై సమన్వయంతో ముందుకు సాగడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. హజ్ యాత్రికుల అన్ని వేళల కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ ఆదేశాల మేరకు ఎల్లప్పుడూ హజ్ యాత్రికుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

## ఆత్మకూరులో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత రెండేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 1,150 కుటుంబాలకు మొత్తం రూ.10,42,08,879 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. తాజాగా మరో 69 కుటుంబాలకు రూ.63,79,000 విలువైన చెక్కులు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మంజూరై అందుబాటులోకి వచ్చాయని, వాటిని లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వివరించారు. అనారోగ్యంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్న సమయంలో వైద్య ఖర్చులు భరించలేక పేద కుటుంబాలు అప్పులపాలవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. అర్హులైన బాధితులకు అవసరమైన సహాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం అందక ఏ కుటుంబమూ ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్య చికిత్స పొందాలని లబ్ధిదారులకు సూచించారు.

## కేంద్రంపై అభిజిత్ దీప్కే తీవ్ర ఆరోపణలు!

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నియామకానికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాన్ని నీరుగార్చేందుకు, వివిధ నిరసన బృందాల పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ వారి మధ్య అపనమ్మకాన్ని, అనుమానాలను రేకెత్తిస్తోందని ఆయన విమర్శించారు. గతంలో సీజేపీ నిరసనకు అనుమతి లభించినప్పుడు, కొందరు తమను బీజేపీ అనుకూల వ్యక్తులుగా చిత్రీకరిస్తూ కుట్ర సిద్ధాంతాలను ప్రచారం చేశారని ఆయన గుర్తు చేశారు. నిన్న ఇండియా కూటమి భారీ నిరసన చేపట్టిన నేపథ్యంలో, అక్టోబర్ 10న తమపై ప్రయోగించిన ఉక్కుపాదాన్ని ప్రభుత్వం వారిపై ప్రయోగించలేదని ఆయన వివరించారు. “ప్రజలను ఒకరిపై ఒకరిని ఉసిగొల్పడమే ఈ ప్రభుత్వ విధానం. ఒక నిరసనను అనుమతించి, మరొకదాన్ని అణిచివేయడం ద్వారా ఒకే లక్ష్యం కోసం పోరాడుతున్న వర్గాల మధ్య అనుమానాలకు ఆస్కారం కల్పిస్తున్నారు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కుట్రపూరిత వ్యూహం వెనుక ఉన్న అంతరార్థాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలని అభిజిత్ దీప్కే కోరారు. “నేడు ఒకరికి అనుమతినిచ్చి, మరొకరిని అణిచివేస్తే ప్రభుత్వం, రేపు దానికి భిన్నంగా వ్యవహరించవచ్చు. అధికారాన్ని ప్రశ్నించడం మానేసి, నిరసనకారులు తమలో తామే కలహించుకునేలా చేయడమే పాలకుల అంతిమ లక్ష్యం” అని ఆయన విశ్లేషించారు. తప్పుడు ప్రచారాలను, కుట్ర సిద్ధాంతాలను నమ్మి విడిపోవద్దని, అంతర్గత విభేదాల ఉచ్చులో పడవద్దని ఆయన ప్రజలకు, వివిధ నిరసన బృందాలకు విజ్ఞప్తి చేశారు. “మనమంతా ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. మన పోరాటం జ్ఞానేశ్ కుమార్ నియామకంపై, ఆయనను వెనకేసుకొస్తున్న వ్యవస్థపైనే అన్న విషయాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ విస్మరించకూడదు” అని ఆయన స్పష్టం చేశారు.

## విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర: కిషన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి... కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. “కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

## శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు

● రెండు తెలుగు రాష్ట్రాలకు శ్రీశైలం ప్రాజెక్టు గర్వకారణం ● ఇంజినీరింగ్ పటిష్ఠత, విద్యుత్ ఉత్పత్తి, బహుముఖ ప్రయోజనాలకు గుర్తింపు ● సీఎం చంద్రబాబు ముందుచూపుతో అందుబాటులోకి పట్టిసీమ ప్రాజెక్టు ● -

ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం తెలుగు రాష్ట్రాల



ప్రజలకు గర్వకారణమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. డ్యామ్ నిర్మాణ పటిష్ఠత, జలవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, సాగు, తాగు నీటి అవసరాలకు అందిస్తున్న సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. శ్రీశైలం జలాశయం దశాబ్దాలుగా భారీ వరదలను తట్టుకుంటూ ప్రజలకు సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. ఇది కేవలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదని, లక్షలాది మంది తాగునీటి అవసరాలతో పాటు లక్షల ఎకరాల సాగునీటి అవసరాలను తీరుస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు అని వివరించారు. కృష్ణా జలాల వినియోగంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో విశేషమైన ప్రాధాన్యం కలిగి ఉందన్నారు.

### పట్టిసీమతో రాయలసీమకు ప్రయోజనం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పట్టిసీమ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావడం వల్ల శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడిందని గొట్టిపాటి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని అందించడం వల్ల శ్రీశైలం జలాలను రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు వెసులుబాటు కలిగిందన్నారు. కృష్ణా డెల్టా రైతులకు అవసరమైన నీటిని అందిస్తూనే రాయలసీమ ప్రాంత అవసరాలకూ శ్రీశైలం జలాశయం అండగా నిలుస్తోందని తెలిపారు. అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించడం, ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా నీటిని సద్వినియోగం చేయడంలో ముఖ్యమంత్రి ముందుచూపు స్పష్టంగా కనిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు

## నిస్సార్ అహ్మద్ మృతి. కుటుంబ సభ్యులను ఓదార్చిన మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల వి.సి. కాలనీకి చెందిన నిషార్ హమ్మద్ ఈరోజు అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న నంద్యాల నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిబ్బూ మృతుడి నివాసానికి చేరుకుని నిషార్ హమ్మద్ భౌతికకాయాన్ని సందర్శించారు. వారి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

అనంతరం నిషార్ హమ్మద్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన గాఢ సానుభూతిని తెలియజేయడంతో పాటు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు దాల్ మిల్ అమీర్, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, వైసీపీ మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా సంస్కృతిక విభాగం అధ్యక్షుడు టివి రమణ, వైసీపీ జిల్లా సెక్రెటరీ శివ నాగిరెడ్డి, పద్మశ్రీ సుబ్బరాయుడు,స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు దాదాభాయ్, నాజీర్, పాల్గొన్నారు.

## మద్యానికి బానిసైతే మాన్పించవచ్చు




మహానంది, పల్లె వెలుగు మత్తు పదార్థాలు, మద్యానికి బానిసైతే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ అడిక్షన్ సెంటర్లో చేర్పిస్తే, వైద్యుల పర్యవేక్షణలో మాన్పించవచ్చు అని శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ డిఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఉపాధి హామీ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే వెంటనే 1098 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, మహిళా పోలీసు లక్ష్మీదేవి, జనసేన నాయకులు చందు, మహిళలు పాల్గొన్నారు.

## మూడవరోజు శరన్నవరాత్రులు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 13: బండి ఆత్మకూరు మండలంలో దసరా పండుగ సందర్భంగా మూడవరోజు శరన్నవరాత్రులు కార్యక్రమాలు జరిగాయి. మండల పరిధిలో ఉన్న గంగా ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో వినాయకునికి ఓంకార సిద్దేశ్వర స్వామి వారికి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అమ్మవారి అలంకారం అర్చన నవగ్రహ మండపారాధన మహా మంగళహారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నదేవలాపురం గ్రామానికి చెందిన ఉభయదాతలు కోరకంచి శంకర్, శంకరమ్మ పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగప్రసాద్ దేవస్థానం చైర్మన్ అల్లె చెన్నారెడ్డి, ధర్మ కర్తల మండలి సభ్యులు, అర్చకులు భాస్కర శర్మ ,సురేష్ శర్మ , భక్తులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. బండి ఆత్మకూరు లోని జనార్ధన స్వామి ఆలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని అన్నపూర్ణాదేవి గా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అన్నపూర్ణ దేవికి పూజలు నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరి ఆలయంలో కూడా అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కళ్ళకు గంతలు కట్టుకొని వీఆర్ఏల నిరసన

బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 13: బండి ఆత్మకూరు మండలంలో గ్రామ రెవెన్యూ



సహాయకులు మంగళవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్నమైన రీతిలో నిరసన తెలిపారు. గ్రామ రెవెన్యూ నాయకులు చేస్తున్న నిరసన కార్యక్రమం 28వ రోజుకు చేరుకుంది. తమ సమస్యల పరిష్కారంలో పాలక పక్షం ఏమాత్రం దృష్టి సారించడం లేదని విచారం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటామని గ్రామ రెవెన్యూ సహాయకులు స్పష్టం చేశారు.

## నంద్యాల ఆటోనగర్ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.

● రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్. ● హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్.ఏ.ఎమ్) ద్వారా రూ. 18 కోట్లతో మౌలిక వసతుల పనులకు ఘనంగా శంకుస్థాపన. ● రహదారులు, సెంట్రల్ మీడియన్, ఎల్ఈడీ లైటింగ్, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణ సమగ్ర ప్రగతితో పాటు పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాల ఆధునీకరణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు . మంగళవారం నంద్యాల ఆటోనగర్ పరిధిలో 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' (హెచ్.ఏ.ఎమ్) పథకం కింద రూ. 18.00 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు మంత్రి ఫరూక్ ఘనంగా భూమిపూజ చేసి, శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల ఆటోనగర్‌ను ఆధునిక హంగులతో, వ్యాపార-పారిశ్రామిక వర్గాలకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. నాణ్యమైన అంతర్గత, ప్రధాన తారు/సీసీ రహదారుల నిర్మాణం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భద్రత కోసం సెంట్రల్ మీడియన్ల ఏర్పాటు, రాత్రి వేళల్లో



రాకపోకలకు ఇబ్బంది లేకుండా అత్యాధునిక సెంట్రల్ స్ట్రీట్ లైటింగ్ (వీధి దీపాలు), పర్యావరణ పరిరక్షణ, ఆహ్లాదం కోసం పార్కుల ఆధునీకరణ, సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ద్వారా పనులు వేగవంతంగా, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో పూర్తవుతాయని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్లను మంత్రి ఫరూక్ ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు, ఆటోనగర్ కార్మికులకు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు .

ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, ఆటోనగర్ ప్రెసిడెంట్ జాకీర్ , పబ్బతి వేణు, ఉడుమాల్పురం కళ్యాణ్, లోకేష్, గఫార్ ,
నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఆటోనగర్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రముఖులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రూ. 13.50 కోట్లతో నందమూరి నగర్, వైఎస్సార్ నగర్‌లలో అభివృద్ధి పనులకు మంత్రి ఎన్ఎండి ఫరూక్ శంకుస్థాపన.

హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్.ఏ.ఎమ్) ద్వారా అధునాతన మౌలిక సదుపాయాల కల్పన.
రహదారులు, సెంట్రల్ మీడియన్, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్.ఏ.ఎమ్) పథకం కింద సుమారు రూ. 13.50 కోట్ల వ్యయంతో నందమూరి నగర్ మరియు వైఎస్సార్ నగర్ పరిధిలో చేపట్టనున్న పలు కీలక మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు మంత్రివర్యులు ఘనంగా శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పట్టణవాసులకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఆధునిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నాణ్యమైన అంతర్గత, ప్రధాన రహదారుల నిర్మాణం, ట్రాఫిక్ నియంత్రణ మరియు అందాన్ని పెంచేలా సెంట్రల్ మీడియన్ల ఏర్పాటు ప్రజల భద్రత, రాత్రి వేళల్లో రాకపోకల సౌలభ్యం కోసం సెంట్రల్ స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థ, ప్రజలు ఆహ్లాదకర వాతావరణం పొందేందుకు అధునాతన పార్కుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను మంత్రి ఆదేశించారు. నగరంలోని



అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు .

ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గ రాముడు, తాటికొండ మహేష్ , ప్రసాద్ రెడ్డి, గోవిందు నాయుడు , మాజీ కౌన్సిలర్ నాగార్జున, పద్మ, నారాయణ, సురేష్ రెడ్డి, కొమ్ము శ్రీహరి, సురేష్ , నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎంఈ నాగభూషణం రెడ్డి మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, నాయకులు మరియు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నంద్యాల న్యాయవాదులు కృషి చేయాలి: ఎన్ ఎం డి ఫిరోజ్".

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి ఫిరోజ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్ ఎం డి ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు సమష్టిగా కృషి చేయాలని ఎన్ ఎం డి ఫిరోజ్ తెలిపారు.

ఈ సందర్బంగా ఎన్ ఎం డి ఫిరోజ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో నంద్యాలలో టీడీపీ అభ్యర్థి ఎన్ ఎం డి ఫరూక్ భారీ మెజారిటీతో విజయం సాధించడంలో న్యాయవాదుల సహకారం కీలకమన్నారు. అదే స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండీ ఫరూక్ గారు న్యాయవాదుల



సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జూనియర్ కోర్టుల మంజూరు, సిబ్బంది నియామకం వంటి చర్యలు న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరమన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు అంశం త్వరలో పూర్తి కానుందని ఎన్ ఎం డి ఫిరోజ్ తెలిపారు.ప్రజలకు న్యాయపరమైన అవగాహన కల్పించడంతో పాటు, వైసీపీ పార్టీ చేస్తున్న నీచ రాజకీయాలను ఎండకడుతూ పార్టీ బలోపేతానికి న్యాయవాదులు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని నాయకులు సూచించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఎన్ఎండీ ఫయాజ్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి వెదుర్ల రామ చంద్రరావు, మార్క్ ఫెడ్ కార్పొరేషన్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి, హుస్సేన్ భాష, ఎస్ ఐ ఖలీల్, డి ఎన్ బాబు,ప్రసాద్ రెడ్డి, గొల్ల జయకృష్ణ,నటరాజ రావు, మద్దిలేటి,సాయిరాం రాయల్,బాలహాజీ మరియు తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నంద్యాల మండలంలో అన్ని జిల్లాల్లో గ్రామాల్లో ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి.

**● జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలికి పనులు కల్పించాలి. ● ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకాన్ని వెంటనే ప్రారంభించి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీకి ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ఈరోజు నంద్యాల మండలం ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల మండల మహాసభ నంద్యాల సిఐటియు జిల్లా కార్యాలయంలో బండి రత్నమయ్య అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ నాయక్ సిఐటియు జిల్లా కార్యదర్శిలు వెన్న బాల వెంకట్ డి లక్ష్మణులు పాల్గొని మాట్లాడుతూ ఎల్ నీ ఓ ప్రభావం వల్ల నంద్యాల మండలం కరువు మండలంగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు కూడా ఉపాధి పనులు అన్ని గ్రామాల్లో ప్రారంభించకపోవడం వల్ల వ్యవసాయ కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సాక్షాత్తు మన జిల్లా కలెక్టర్ మేడం గారు అన్ని




గ్రామాల్లో వెంటనే ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని ఆదేశించినప్పటికీ మండల ఏ పీ ఓ ఏ గారు స్పందించకపోవడం చాలా దుర్మార్గంగా ఉందని వెంటనే నంద్యాల మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే వ్యవసాయ కార్మికులు అందరినీ కలుపుకొని ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

అనంతరం నంద్యాల మండలం వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని మహాసభ ఏకీభవంగా ఎన్నుకోవడం జరిగింది నూతన అధ్యక్షునిగా బంగారయ్య కార్యదర్శిగా చెరుకు కృష్ణ ఉపాధ్యక్షులుగా జయన్న బండి రత్నమయ్య, ప్రభుదాసు, సహాయ కార్యదర్శిగా రామకృష్ణ, నాగలక్ష్మి సునీల్ కుమార్, బసురున్ బి ఆంటోనీ కమిటీ సభ్యులుగా నూర్ భాషా, నాగలక్ష్మి, ఏ సంజీవరాయుడు, అశోక్ కుమార్ రంజాబి, తోపాటు 20 మందిని కమిటీ సభ్యులుగా ఏకీభవంగా ఎన్నుకున్నారు.

# ఈ నెల 17న నంద్యాలలో జరిగే జిల్లా

## ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మహేష్ పిలుపు

కొలిమిగుండ్ల (పల్లె వెలుగు న్యూస్)




రిపోర్టర్ :-పాఠశాలల్లో విద్యార్థులకు సేవలందిస్తూ, పరిసరాల పరిశుభ్రతను పరిరక్షిస్తూ, రాత్రివేళల్లో పాఠశాలలకు భద్రత కల్పిస్తున్న స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా పరిష్కరించాలని ఏఐటీయూసీ కొలిమిగుండ్ల మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 17న నంద్యాలలో నిర్వహించనున్న స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల ప్రథమ మహాసభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, చాలీచాలని వేతనాలతో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం చెల్లించాలని అన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మహాసభలో చర్చించనున్న ప్రధాన డిమాండ్లు- ,స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు నెలకు రూ.10,000 గౌరవ వేతనం చెల్లించాలి,ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ ఉద్యోగులుగాగుర్తించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతి ఉద్యోగికి నాణ్యమైన యూనిఫామ్ అందించాలి. స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు,ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని మహేష్ అన్నారు. ఉద్యోగుల హక్కులు, వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమం తదితర అంశాలపై నంద్యాలలో జరిగే ప్రథమ మహాసభలో సమగ్రంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. అందువల్ల స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఈ నెల 17న నంద్యాలలో నిర్వహించే ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ కొలిమిగుండ్ల మండల కార్యదర్శి మహేష్ పిలుపునిచ్చారు.

# నదుల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు

**● నగర ప్రజలకు కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపు ● అపరిశుభ్రతతో ప్రజారోగ్యానికి ముప్పు**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : నదులు, కాలువలు, నీటి ప్రవాహ మార్గాలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నగర ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. మంగళవారం కేసీ కెనాల్‌లోని వినాయక ఘాట్, రాజ్‌విహార్, వై. జంక్షన్, బిర్లా కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని, చెత్తను ఇష్టానుసారంగా పడేయడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. నదులు, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్త వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలగడమే కాకుండా పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు, ఈగలు వృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం కేసీ కెనాల్‌లో నీటి



ప్రవాహం లేని నేపథ్యంలో, నిల్వ ఉన్న నీటిలో చెత్తాచెదారం వేయడం వల్ల ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన, నదులు, కాలువల్లో చెత్త వేస్తూ పరిసరాలను కలుషితం చేసే వారిపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. ఈ తరహా చర్యలను పర్యవేక్షించేందుకు కెమెరాలు ఉన్నాయని తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఫరుక్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

---

# నెమళ్ల కుంట చెంచు కాలనీలో పైపులైన్ పనులు ప్రారంభం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు అక్టోబర్ 13: బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న గాలి చెన్నయ్యపాలెం గ్రామానికి సమీపంలో ఉన్న నెమళ్లకుంట చెంచు కాలనీలో పైపులైన్ ఏర్పాటులకు గాను మంగళవారం పనులను ప్రారంభించారు. చెంచు కాలనీలో జలజీవన్ మిషన్ ద్వారా పైపులైను ఏర్పాటుతోపాటు ఇంటింటికి పులాయి కనెక్షన్ ఇచ్చేందుకు గాను పైపులైను నిర్మాణానికి పూనుకున్నారు. కాలనీలో కొత్తగా పైపులైను మంజూరు చేయించినందుకు గాను కాలనీవాసులు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కే లింగారెడ్డి, సంఘీపెద్దన్న నందలయ్య, రుద్రప్ప, కాలనీవాసులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం కింద మాజీ మావోయిస్టు కుటుంబానికి గృహ వసతి.

-నంద్యాల పట్టణంలోని నందమూరి నగర్‌లో కృష్ణవేణి నూతన గృహాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జనజీవన స్రవంతిలోకి వచ్చిన మాజీ మావోయిస్టు



బోయ కృష్ణవేణికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం కింద ఇల్లు మంజూరైంది. నంద్యాల పట్టణంలోని నందమూరి నగర్‌లో నిర్మించిన ఆమె నూతన గృహాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ప్రారంభించారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకం ద్వారా గృహ వసతి కల్పిస్తోందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో సొంత ఇళ్లు లేని అర్హులైన కుటుంబాలకు సురక్షితమైన నివాస సదుపాయం కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీడీ శ్రీహరి గోపాల్, డీఈ విజయ్ బాబు, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ తదితర అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# గాయత్రీదేవి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

గడివేముల:గాయత్రీ దేవిని దర్శిస్తే సకల మంత్రసిద్ధి ఫలితంలభిస్తుందని అమ్మవారిశాల



అర్చకులు వసంతలక్ష్మి అన్నారు. మండలకేంద్రమైన గడివేములలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో దసరా శరన్నవరాత్రుల కార్యక్రమాల్లో భాగంగా మూడవ రోజు ఆశ్వయుజ శుద్ధ తదియ మంగళవారం నాడు విశాఖ నక్షత్రం శ్రీ మత్ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గాయత్రీదేవి కుంకుమార్చన, శ్రీ లక్ష్మీ గణపతి హోమం, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు వసంతలక్ష్మి మాట్లాడుతూ శ్రీశ్రీ గాయత్రీ దేవి సకల మంత్రాలకు మూలమైన శక్తిగా వేదమాతగా ప్రసిద్ధి,గాయత్రి అమ్మవారి ముఖంలో అగ్ని, శిరస్సులో బ్రహ్మదేవుడు, హృదయంలో శ్రీ మహావిష్ణువు కొలువై ఉంటారని పురాణాల్లో ఉందనీ ఈ ఉపాసన చేసేవారిలో బుద్ధి, తేజస్సు వృద్ధి చెందుతుంది. గాయత్రి మంత్ర జపం,గాయత్రీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారి దర్శనం నాలుగు వేదాలు పారాయణం చేసినంత ఫలితాన్నిస్తుందన్నారు. గాయత్రీదేవిని దర్శించుకుంటే సకల మంత్ర సిద్ధి ఫలం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదనుప్తా, కమిటీ సభ్యులు ఆర్యవైశ్య సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 13 ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం మండలం ఎమ్మిగనూరు నియోజకవర్గం, నందవరం మండలంలోని మిట్ట సోమాపురం గ్రామానికి చెందిన బి. రామలింగప్ప మరియు రామకృష్ణ కి ఆదోని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ =వశ్రీఅవట ఖీబఅఎ) మంజూరు కావడం జరిగింది

ఈ సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కార్యాలయంలో కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి గురురాజు దేశాయ్ సమక్షంలో లబ్ధిదారులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందుకున్నారు.

ప్రజలకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించడం ద్వారా బాధిత కుటుంబాలకు ఎంతో ఊరట లభిస్తుంది. ఈ సహాయానికి సహకరించిన ఆదోని నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కి, కూటమి ముక్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలందరి తరపున గురురాజు దేశాయ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బిఎల్ నారాయణ, ఎల్ఎల్సి కాల్వ చైర్మన్ రామన్న గౌడ్, బిజెపి ఎమ్మిగనూరు టౌన్ పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మజార లోకేష్, నందవరం మండలం ఓబిసి మోర్చా అధ్యక్షులు పరశు రాముడు, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు



కళ్ళైల్ శివ, ఎమ్మిగనూరు మండలం ప్రధాన కార్యదర్శి విజయ్ మోహన్, కోటేకల్ సీనియర్ నాయకులు బి రామాంజనేయులు, కోటేకల్ గౌస్, నందవరం మండలం ఉపాధ్యక్షులు జోహారాపురం నాగేష్, నందవరం మండలం బీజేవైఎం అధ్యక్షులు వాల్మీకి దండు వీరేశ్, కందనాతి నరసింహులు, రంగస్వామి, తిమ్మప్ప, పంపయ్య, తదితరులు పాల్గొన్నారు...

# జాతీయస్థాయిలో రాణించాలి,,,,,

## ఉషారాణిని సన్మానించి ఆర్థిక సహాయం అందజేత,,,,

నందవరం పల్లె వెలుగు అక్టోబర్ 13 జాతీయస్థాయి క్రీడలకు నందవరం కేజీబీవీ పాఠశాల



విద్యార్థిని ఎం.ఉషారాణి ఎంపిక కావడం మండలానికి గర్వకారణమని టీడీపీ నాయకులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాధవరావుదేశాయ్ అన్నారు.గట్కా క్రీడలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైన ఉషారాణిని ఆయన సన్మానించి ఆర్థిక సహాయం అందజేశారు.జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.క్రీడాభివృద్ధికి తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.అభివృద్ధికి ప్రోత్సహిస్తున్నందుకు, అభినందించినందుకు మాధవరావుదేశాయ్ కు విద్యార్థిని ఉషారాణి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల కమిటీ చైర్మన్ భీమన్న,విద్యార్థిని తండ్రి ఉరుకుందు,తల్లి గోవిందమ్మ,చాకలి వెంకటేష్,శ్రీనివాసులు,తెలుగు ఈరన్న, పంపయ్య,వలి,లక్ష్మన్న,ఉరుకుందు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి: మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబర్ 13, పల్లెవెలుగు ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేద



కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ఎంతో అండగా నిలుస్తోందని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 55 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.24,25,160 ఆర్థిక సహాయాన్ని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, పేద కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు

# వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి బీసీకి వినతి




బనగానపల్లె, అక్టోబర్ 13, పల్లెవెలుగు వీఆర్ఏలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలోవీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్ఏల సమస్యలను డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు వీఆర్ఏలు తెలిపారుఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు గౌస్ పీరా, సంఘం నాయకులు హరిబాబు, బాలుడు, బాలసుబ్రమణ్యం, వీఆర్ఏ లు పాల్గొన్నారు.

# యాగంటికి ఎక్సైజ్ సీఐ విరాళం



బనగానపల్లె , అక్టోబర్ 13, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీఉమామహేశ్వర స్వామి దేవస్థానాకి బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వై.సతీష్ రూ.10,000/- ల విరాళం ఆలయ ఈఓ పాండురంగా రెడ్డి , చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి లకు అందజేశారు. దాతకు ప్రత్యేక పూజలు జరిపించి వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, అందజేశారు.

# ప్రతి పేద కుటుంబానికి ఇంటి పట్టా ఇవ్వాలి

- ☛ఎన్నికల హామీ మేరకు జర్నలిస్టులకు నివాస స్థలాలు కేటాయించాలి
- ☛సీపీఐ రిలే నిరాహార దీక్షలకు ఏపీయూడబ్ల్యూజే సంఘీభావం

కర్నూలు, అక్టోబర్ 13(పల్లె వెలుగు): ప్రతి పేద కుటుంబానికి నివాస స్థలం కేటాయించి ఇంటి పట్టా ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ఇంటి స్థలాల కోసం తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు వారు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నగర సహాయ కార్యదర్శి సీ. మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈ.ఎన్. రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ. కొండప్ప, ఐజేయూ సభ్యుడు కె. నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. కర్నూలులో అనేక మంది పేదలు




సొంత ఇళ్లు లేక అద్దె గృహాల్లో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు కూడా నివాస స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు కె. జగన్నాథం, మనోహర్ మాణిక్యం, డి. శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు మధు, నగర అధ్యక్షుడు మల్లికార్జున, నాగరాజు, ఫోటో జర్నలిస్టుల యూనియన్ నాయకుడు రఫీ, సీపీఐ నగర నాయకులు బీసన్న, నాగరాజు, సీ. కుమార్, రామాంజనేయులు, మహిళా సమాఖ్య నాయకులు ధనలక్ష్మి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

---

# పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ఆంధ్రప్రదేశ్,,,,

- పల్లె పండుగ 3.0 కార్యక్రమం,,,,,
- భూమి పూజ కార్యక్రమంలో టిడిపి నాయకులు,,,

నందవరం పల్లె వెలుగు అక్టోబర్ 13 ఎమ్మిగనూరు నియోజకవర్గంలో
నందవరం మండలంలో
కనకవీడు గ్రామంలో
పల్లె పండుగ అభివృద్ధి పనులకు భూమి పూజ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో
ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు అదేశాలతో నియోజక వర్గం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరెడ్డి ఆదేశాల మేరకు పల్లె పండగ 3 .0భూమి పూజ చేశారు కనకవీడు గ్రామంలో
ఐదు చోట్ల సీసీ రోడ్లకు భూమి పూజ చేయడం జరిగింది ఈ కార్య క్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కాశిం వలి మాట్లాడుతు కనకవీడు గ్రామంలో అభివృద్ధి అంటే కేవలం తెలుగు దేశము పార్టీ అని గతము అయిన ఇప్పుడైన కేవలము కనకవీడు ను అభివృద్ధి చేసింది కేవలం తెలుగు దేశం పార్టీ అని వారు తెలిపారు అదే విధంగా మన ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు . అభివృద్ధి. సంక్షేమము. లో మరియు అమరావతి రాజధానికి పెట్టు బడులు





తీసుకొని రావడములో నిరంతరము కృషి చేస్తున్నాడని అడ్మినిస్ట్రేషన్ నడిపించాలంటే కేవలము నారా చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని దేశములో మన రాష్ట్రమును నెంబరు వన్ గా తీర్చు దిద్దు తారని ప్రజలకి తెలిపారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కాసిం వలి, సొసైటీ చైర్మన్ గోపాల్ టీడీపీ గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న ఏఈ నరసింహులు, సీతారాములు డిజిటల్ అసిస్టెంట్ బజారి. వెల్ఫేర్ అసిస్టెంట్ సలీం. హౌసింగ్ భీమేష్ , డీలర్లు దుబ్బన్న , మునిస్వామి, నరసింహులు, మోజెస్ దేవదాస్ అశోక్ కుమార్ పురుషోత్తం లాజర్, లక్ష్మన్న, కాషారం, రాంబాబు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# కురుబల సంక్షేమానికి రెండు కీలక ప్రతిపాదనలు.

**50 ఏళ్లు నిండిన గొర్రెల కాపరులకు పింఛన్ ఇవ్వాలి.. ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల భూమి కేటాయించాలి.**
**విజయవాడలో కురుబ కురుమ కార్పొరేషన్ మూడో బోర్డు సమావేశం.**

ఆదోని (పల్లె వెలుగు): ఆంధ్రప్రదేశ్‌లోని కురుబ, కురుమ సామాజిక వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఏపీ కురుబ కురుమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. విజయవాడలోని బీసీ భవన్‌లో కార్పొరేషన్ మూడో బోర్డు సమావేశాన్ని చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ భీమశంకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప మాట్లాడుతూ.. కురుబ, కురుమ సామాజిక వర్గాల జీవనోపాధి, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సమావేశంలో రెండు కీలక ప్రతిపాదనలను అజెండాలో పొందుపరిచినట్లు తెలిపారు.



గొర్రెల కాపరులకు పింఛన్ ఇవ్వాలి

గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న కురుబ, కురుమ సామాజిక వర్గాలకు చెందిన కాపరులకు 50 ఏళ్లు నిండిన తర్వాత పింఛన్ అందించే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా గొర్రెల మేత కోసం ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ చర్యలు గొర్రెల కాపరుల జీవనోపాధికి తోడ్పడతాయని పేర్కొన్నారు.

**గత ప్రతిపాదనల అమలుపై చర్చ**

గత బోర్డు సమావేశంలో ప్రతిపాదించిన అంశాల్లో గొర్రెలకు జీవబీమా సౌకర్యం కల్పించే అంశం అమలులోకి వచ్చిందని తెలిపారు. గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించే అంశం ఇంకా పెండింగ్‌లో ఉందని, దీనిని త్వరలో అమలు చేస్తామని ప్రభుత్వం తెలిపినట్లు పేర్కొన్నారు. కురుబ, కురుమ సామాజిక వర్గాల అభ్యున్నతికి సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లేందుకు బోర్డు సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని మాన్వి దేవేంద్రప్ప పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# కల్తీ ఆహారం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.

**మాట్లాడుతున్న సీహెచ్ భార్గవ్**

దొర్నిపాడు అక్టోబర్ 13 పల్లె వెలుగు న్యూస్ అనునిత్యం మనం తీసుకునే తినే ఆహారం లో చాలా వరకు కల్తీ జరుగుతందని వాటిని గుర్తించాలని లేదంటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని సీహెచ్ బార్గవ్ సూచించారు. ' మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆశవర్కలకు ఆహార వస్తువుల్లో జరుగుతున్న కల్తీపై అవగాహన కల్పించారు. కారంపోడి, పాలు, వంట నూనె, నెయ్యి వంటి వాటిల్లో చాలా సులభంగా కల్తీ కల్పిందేకు ఆస్కారం ఉండన్నారు. ఆశవర్కర్లు వీటిని గుర్తించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి కల్తీ లేని ఆహారం



తీసుకునేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఐలు రవికుమార్, విమల తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ నంబర్--1 హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి.

**వాచ్‌మెన్ మల్లేశప్పను బదిలీ చేయాలి.. ఎస్ఎఫ్ఐ డిమాండ్.**



ఆదోని (పల్లె వెలుగు) ఆదోని పట్టణంలోని ఎస్సీ నంబర్--1 హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో వాచ్‌మెన్ మల్లేశప్పను బదిలీ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సహాయక సాంఘిక సంక్షేమ అధికారి వెంకటరాముడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సంజయ్, శశిధర్ మాట్లాడుతూ.. హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం అందించాల్సిన గుడ్లు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని పేర్కొన్నారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించేలా ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని సూచించారు. విద్యార్థుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వాచ్‌మెన్ మల్లేశప్పను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై సహాయక సాంఘిక సంక్షేమ అధికారి వెంకటరాముడు స్పందిస్తూ, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌస్, రహిమాన్, షాహిద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనిలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి.

**-ఐదు నియోజకవర్గాల మహిళల ఇబ్బందులు తొలగించాలి.. ఎస్ఎఫ్ఐ వినతి.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి, మహిళా సీఐతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదోని ఏఎస్పీ జై శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సంజయ్, శశిధర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళా పోలీస్ స్టేషన్ కర్నూలు నగరంలో ఉండటంతో ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు చెందిన మహిళలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కర్నూలుకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దాదాపు 120 నుంచి 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడం, రవాణా సౌకర్యాల కొరత కారణంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గృహ హింస, కుటుంబ సమస్యలు, వేధింపులు తదితర సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు మహిళా పోలీసు అధికారులు అందుబాటులో ఉండటం అవసరమని అన్నారు. తగిన సంఖ్యలో మహిళా పోలీసు సిబ్బందిని



ఐదు నియోజకవర్గాల మహిళలకు సమీపంలోనే పోలీసు సేవలు అందుబాటులోకి వస్తే తమ సమస్యలను సులభంగా తెలియజేసి, సత్వర న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆదోనిలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, మహిళా సీఐతో పాటు నియమించాలని సంబంధిత ఉన్నతాధికారులను కోరారు. ఈ విషయంపై అధికారులు సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, గౌస్, చందన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు తోడ్పాటు అందించేందుకు రాయలసీమ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలు.

**● అక్టోబర్ 12 నుంచి 17వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో నమోదు. ● ఉద్యాన పంటల సాగు నుంచి మార్కెటింగ్, ఎగుమతుల వరకు సహకారం. ● జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్" కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లాలో ఉద్యాన రంగ అభివృద్ధికి, రైతుల ఆదాయ వృద్ధికి సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 45 వేల హెక్టార్లలో విస్తరించిన ఉద్యాన పంటలకు మొక్కల పెంపకం నుంచి సాగు, కోత అనంతర నిర్వహణ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ఎగుమతుల వరకు అవసరమైన సాంకేతిక, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 15 క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 12 నుంచి 17వ తేదీ వరకు రాయలసీమ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఉద్యాన రంగంలో ఆసక్తి కలిగిన అర్హులైన రైతులు, పారిశ్రామికవేత్తలు, వివరాలు సేకరించి నమోదు చేయనున్నట్లు తెలిపారు.



ఉద్యాన రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన నాటే పదార్థాలు, పంటల నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతులకు సంబంధించిన అవకాశాలను సమగ్రంగా అనుసంధానించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, పంట కోత అనంతరం జరిగే నష్టాలను తగ్గించడం, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) ఉద్యాన పంటల సాగు, నాణ్యమైన మొక్కల పెంపకం, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా సూక్ష్మ సేద్యం, పంటల ఉత్పాదకత పెంపు, కోత అనంతర నిర్వహణ, శీతల గిడ్డంగులు, ప్యాక్‌హౌస్‌లు, రవాణా, మార్కెటింగ్, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉన్నవారి నుంచి పొందేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి కలిగిన రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు అక్టోబర్ 17వ తేదీలోగా తమ సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) లేదా గ్రామ ఉద్యాన సహాయకులను సంప్రదించి నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## రైతులుఈకేవైసీ తప్పనిసరి చేయించుకోవాలి

దొర్నిపాడు అక్టోబర్ 13 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడు మండలంలో రైతులు సాగుచేసిన పంటలకు పంట నమోదుతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల మంగళవారం తెలిపారు. ఈసందర్భంగఆమెమాట్లాడుతూఎల్నినో ప్రభావంవల్లమండలంలో తీవ్ర దరాబావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో కరువు మండలంగా ప్రకటించారని ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే తప్పని సరిగా రైతులందరూ



ఈకేవైసీచేయించుకోవాలన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి- మంత్రి



బనగానపల్లె, అక్టోబర్ 13, పల్లెవెలుగు ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణం లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన వినతులు, అర్జీలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్వీకరించారు.ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందిన అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల వినతులపై నిర్లక్ష్యం వహించకుండా అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టడం లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు

## మంత్రి బీసీ కి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వానం

బనగానపల్లె, అక్టోబర్ 13, పల్లెవెలుగు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు,



భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని నందవరం చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ శ్రీనివాసరెడ్డి ఆలయ చైర్మన్ పివి నాగార్జున రెడ్డి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పివి కుమార్ రెడ్డిలు ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నందవరం చౌడేశ్వరి దేవస్థానం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులతో పాటు అవుకు, కోయిలకుంట్ల, బనగానపల్లె పట్టణంలోని మంగళవారంపేట, కొండపేట ఆర్యవైశ్య సంఘాల ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందజేశారు.నందవరం చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించే ఉత్సవాలకు హాజరుకావాలని, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాలకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు.

# 40 మంది బాధితులకు రూ.10.65 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.

**మీనాక్షి నాయుడు సహకారంతో 1,137 మందికి రూ.3.24 కోట్లకు పైగా ఆర్థిక సాయం.**

ఆదోని (పల్లె వెలుగు): పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు కొంకా ఉమాపతి నాయుడు తెలిపారు. ఆదోని పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 40 మంది బాధితులకు మొత్తం రూ. 10,65,378 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో, ఆదోని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ.. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ఆదోని నియోజకవర్గ ప్రజలకు వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందేలా మీనాక్షి నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మీనాక్షి నాయుడు సహకారంతో ఇప్పటివరకు ఆదోని నియోజకవర్గానికి చెందిన 1,137 మంది బాధితులకు మొత్తం రూ. 3,24,45,767 సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## తిరుపాడు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం



పల్లెవెలుగు దినపత్రిక గడివేముల మండలం తిరుపాడు గ్రామములో రాయలసీమ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో కంటి డాక్టర్ కావ్య గారితో ఉచితంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయటం జరిగింది.ఈ శిబిరంలో కంటి సమస్యలు ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు చేసి, మందులు ఇవ్వటం జరిగింది.సుమారుగా 70-80 మంది ఉచిత సేవలను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు చాలా మంచి కార్యక్రమం చేసారని, ఇదివరకు కూడా చాలా మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఉచిత సేవలు అందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరసింహ రెడ్డి ఆర్.ఎం.పి డాక్టర్ శివ,బివిఎన్ రాజు, శేఖర్, మహేష్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చంద్రఘంట అలంకరణలో చౌడేశ్వరి దేవి




బనగానపల్లె, అక్టోబర్ 13, పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చంద్రఘంట అలంకరణలో చౌడేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మూడవ రోజు అమ్మవారు చంద్రఘంట అలంకరణలో భక్తుల పూజలు అందుకున్నారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు .సాయంత్రం ప్రకార రథోత్సవం నిర్వహించారు. భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఎన్. శ్రీనివాస రెడ్డి , ఆలయ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి , ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి. కుమార్ రెడ్డి పర్యవేక్షిన్నారు

## మిడుతూరు లో జరుగుతున్న రెడ్ క్రాస్ ఎయిడ్ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన జిల్లా ట్రెజరర్ డా.అరుణ కుమారి.

పల్లె వెలుగు మిడుతూరు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ పై ప్రత్యేక శిక్షణ పొందిన



ప్రతి ఒక్కరిని ప్రతి పాఠశాలలో, కళాశాలలో శిక్షణ ఇచ్చే విధంగా తయారు చేయడమే రెడ్ క్రాస్ లక్ష్యం రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ అరుణకుమారి తెలిపారు.

స్థానిక మండల కేంద్రమైన మిడుతూరులో గత మూడు రోజులుగా జరుగుతున్న సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ శిబిరాన్ని రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ అరుణ కుమారి సందర్శించారు . ఈ సందర్భంగా ఫస్ట్ ఎయిడ్ పై శిక్షణ పొందిన వారితో మాట్లాడుతూ ఈ ప్రత్యేక శిక్షణ శిబిరంలో ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ పై శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ తమ తమ ప్రాంతాలలో పాఠశాలలను కళాశాలలను సందర్శించి విద్యార్థిని విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ ల పై శిక్షణ ఇచ్చే విధంగా తయారవ్వాలి అనేది రెడ్ క్రాస్ లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు . ఈ సందర్భంగా డాక్టర్ అరుణ కుమారి ఫస్ట్ ఎయిడ్ సి పి ఆర్ ల పై పలు మెలకువలను శిక్షకులకు నేర్పించారు ఈ కార్యక్రమంలో మిడుతూరు రెడ్ క్రాస్ నాయకులు ఎంఎం భాష మూల గోపాల్, రెడ్ క్రాస్ డిఎఫ్ఓ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు అక్టోబర్ 13 పల్లె వెలుగు న్యూస్ దొర్నిపాడుమండలంలోని అమ్మిరెడ్డి నగర గ్రామంలో సీతారాముల దేవాలయం నందు నవరాత్రుల సందర్భంగ గ్రామ ప్రజలు, గ్రామ పెద్దల సహకారంతో అమ్మవారిని కొలువుచేసుకొనినవరాత్రుల కార్యక్రమాలనునిర్వహిస్తున్నారు

మంగళవారంగాయత్రీదేవిఅలంకరణలోదర్శనమిచ్చారు,గాయత్రీదేవి అమ్మవారికి కుంకుమార్చన, శ్రీ లక్ష్మీ గణపతి హోమం, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించామనిఅర్చకులు ఇంద్రగంటి లక్ష్మీకాంత్ శర్మ తెలిపారు ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ శ్రీశ్రీ గాయత్రీ దేవి సకల మంత్రాలకు మూలమైన శక్తిగా వేదమాతగా ప్రసిద్ధి,గాయత్రి అమ్మవారి ముఖంలో అగ్ని, శిరస్సులో బ్రహ్మదేవుడు, హృదయంలో శ్రీ మహావిష్ణువు కొలువై ఉంటారని పురాణాల్లో ఉందనీ ఈ ఉపాసన చేసేవారిలో బుద్ధి, తేజస్సు వృద్ధి చెందుతుంది. గాయత్రి మంత్ర జపం,గాయత్రీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిదర్శనం నాలుగు వేదాలు పారాయణం చేసినంత ఫలితాన్నిస్తుందన్నారు. గాయత్రీదేవిని దర్శించుకుంటే సకలమంత్రసిద్ధిఫలంపొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చక్రవర్తి నాయుడు నర్సారెడ్డి, ప్రజలు, భక్తులు మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ పూజలో పాల్గొన్నారు



# డ్రైవర్ల మెడకు ఉరితాడు లాంటి జీవో నెంబర్ 106 ను రద్దు చేసి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన జంఖ, లారీ, ఆటో వర్కర్స్ యూనియన్లు**

పల్లె వెలుగు బేతంచెర్ల అక్టోబర్ 13:- వాహనాలు నిరంకుశ వైఖరిని నిరసిస్తూ మంగళవారం




నడిపే డ్రైవర్ల మెడకు ఉరితాడు లాంటి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీవో నెంబర్ 106 (1), (2) ను రద్దు చేసి డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జంఖ జిల్లా ఉపాధ్యక్షులు వై. ఎల్లయ్య, లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి. రామాంజనేయులు, ఆటో వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి మద్దిలేటి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డ్రైవర్ల పై పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న బేతంచెర్ల లారీ వర్కర్స్ యూనియన్ (జంఖ అనుబంధం) అధ్యక్షులు బి. రామాంజనేయులు ఆధ్వర్యంలో బేతంచెర్ల పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... లారీ, ఆటో, జీపు, ట్రాక్టర్, వ్యాన్ డ్రైవర్లు వాహనాలు నడిపే సందర్భంగా పొరపాటున లేదా అకస్మాత్తుగా జరిగిన ప్రమాదాలకు డ్రైవరే ప్రధాన కారణమని భావించి ఆ డ్రైవర్ పై 304 క్రిమినల్ కేసు నమోదు చేసి డ్రైవర్ల కుటుంబాలను రోడ్డున పడేసే అడ్డగోలు జీవోలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.వాహనాలు నడిపే డ్రైవర్లు లేకపోతే ఈ సమాజమే ముందుకు సాగదని పాలక ప్రభుత్వాలకు తెలియకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాత్రి పగలు తేడా లేకుండా డ్యూటీలు చేస్తూ యజమానులకు లాభాలు సంపాదించి పెట్టే డ్రైవర్ల పై ప్రభుత్వాలకు ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు.

ప్రస్తుతం డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో ట్రాన్స్‌పోర్ట్ రంగం పూర్తిగా సంక్షోభంలో పడిందని, యజమానులు లారీ కిస్తీలు కట్టుకోలేక వాహనాలు తిప్పుకోలేకపోతున్నారని అన్నారు.

లారీ, ఆటో, జీపు, ట్రాక్టర్ వాహనాలు నడిపే డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

అనంతరం తహశీల్దార్ నాగమణి గారికి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో జంఖ నాయకులు రామకృష్ణ, జె. శ్రీనివాసులు, చల్లా మద్దిలేటి స్వామి, కోట్ల మధు, వెంకటేష్ నాయక్, దేవా నాయక్, లోకేష్, పెద్దయ్య, శంకరాపురం నారాయణ, వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుమలేష్, రామళ్లకోట భాష తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో అంతర్జాతీయ విపత్తుల ప్రమాద తగ్గింపు దినోత్సవం నిర్వహణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత



ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ , నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో అంతర్జాతీయ విపత్తుల ప్రమాద తగ్గింపు దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సురేఖ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్, జిల్లా అగ్నిమాపక అధికారి శంకర్ ప్రసాద్, ఎస్‌డీఆర్ఎఫ్ డీఎస్పీ వెంకట శివయ్య, ఎస్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ రాధాకృష్ణ పాల్గొని విద్యార్థులకు విలువైన సందేశాలు అందించారు. విపత్తులను ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధత, అప్రమత్తత, అగ్ని ప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో పాటించాల్సిన భద్రతా చర్యల ప్రాముఖ్యతను వివరించారు.

అనంతరం జిల్లా అగ్నిమాపక శాఖ మరియు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రత్యక్ష మాక్ డ్రిల్‌లు, రక్షణ చర్యల ప్రదర్శనలు నిర్వహించాయి. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సురక్షితంగా బయటకు వెళ్లే విధానాలు, అత్యవసర సమయాల్లో స్పందించే పద్ధతులపై విద్యార్థులకు ప్రాయోగిక అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా విపత్తుల ప్రమాద తగ్గింపు అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను మై భారత్ బృందం శాలువాలు/సత్కార కార్యక్రమం ద్వారా ఘనంగా సన్మానించింది.

విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, యువత ఈ సందేశాన్ని తమ కుటుంబాలకు, సమాజానికి చేరవేయాలని ఈ కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, జిల్లా అగ్నిమాపక శాఖ, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు మరియు విద్యార్థులకు మై భారత్, నంద్యాల జిల్లా తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# మద్దిలేటి క్షేత్రంలో ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

**- శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారి దర్శనం**



పల్లె వెలుగు బేతంచెర్ల ప్రతినిధి అక్టోబర్ 13 శ్రీ మహాలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా 13-10-2026 తేదీన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి వారి దేవస్థానంలో వేడుకలు వైభవంగా జరిగాయి.

దేవస్థానం డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఎల్ల నాగయ్య పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు జరిగాయి. ధర్మకర్తల మండలి సభ్యులు, వేద పండితులు, అర్చక స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈరోజు నిర్వహించిన విశేష పూజలు:

1. చతుస్థానార్చన: యాగశాలలో కుంభం (కలశం), మండలం (యంత్రం), అగ్ని (హోమగుండం), బింబం (మూలవిరాట్) అనే నాలుగు స్థానాలలో దైవారాధన చేశారు.
2. విశేష తిరుమంజనం (మూలమూర్తికి అభిషేకం): పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార అనే పంచామృతాలతో పాటు కొబ్బరి నీళ్లు, పసుపు నీళు ,, చందనం, పచ్చకర్పూరంతో స్వామివారికి అభిషేకం చేశారు.



ఈ సమయంలో పురుష సూక్తం, శ్రీ సూక్తం, భూసూక్తం, నీలా సూక్తం, నారాయణ సూక్తాలను పఠించారు.

3. అర్చనారాధన ఽ వేదపారాయణం: భక్తుల గోత్రనామాలతో సంకల్పం చేసి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. రుగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద పారాయణం జరిగింది.
4. శ్రీ లక్ష్మీ నారాయణ హవనం: సంపద, కుటుంబ సౌఖ్యం కోసం మూల మంత్ర జపంతో హోమం నిర్వహించారు.
5. సహస్ర దీపాలంకరణ ఽ లలితా సహస్రనామ కుంకుమార్చన: 1000 దీపాల వెలుగుల మధ్య లలితా సహస్రనామ పఠనంతో కుంకుమార్చన చేశారు.
6. అమ్మవారి అలంకారం ఽ వాహన సేవ: ఈరోజు అమ్మవారు 'శ్రీ గాయత్రీ దేవి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వాహన సేవ ఘనంగా జరిగింది.

# నంద్యాల పట్టణంలో రూ.4.50 కోట్ల వ్యయం తో
# రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత.

● సంజీవ నగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు నాలుగు లేన్ల రహదారి అభివృద్ధి : రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ● నంద్యాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత : రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం.డి ఫరూక్.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం.డి ఫరూక్, రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు.

మంగళవారం సాయంత్రం నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ రోడ్డు వరకు కిలోమీటరు 0/0 నుంచి 0/8 వరకు రూ.4.50 లక్షల వ్యయంతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలక ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ , రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి మాట్లాడుతూ.. నంద్యాల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధిలో భాగంగా సంజీవ నగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ రోడ్డు వరకు నాలుగు లేన్ల రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కిలోమీటరు 0/0 నుంచి



0/8 వరకు రహదారిని నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో నిధుల కొరత కారణంగా రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ముఖ్యమంత్రి ఆదేశాలు, సహకారంతో కేవలం తొమ్మిది నెలల కాలంలోనే రూ. 1,021 కోట్లు వెచ్చించి రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గుంతలమయమైన రహదారులను ప్రయాణానికి అనుకూలంగా మార్చేందుకు చర్యలు చేపట్టడం జరిగింది అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం సుమారు రూ. 26 కోట్లతో పనులు చేపట్టగా, ఇప్పటికే 70 నుంచి 80 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. మిగిలిన భూసేకరణ, ఇతర పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. సిరివెళ్ల, రుద్రవరం ప్రాంతాల్లో గతంలో రహదారుల దుస్థితి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ఆసుపత్రులకు వెళ్లేందుకు కూడా అవస్థలు పడాల్సిన పరిస్థితులు ఉండేవని ఈ సమస్యలను పరిష్కార దిశగా రహదారి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ. ప్రజలకు మెరుగైన రవాణా, తాగునీరు, విద్యుత్ దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం బీసీ జనార్దన్ రెడ్డి గారు కోరిన వెంటనే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రహదారుల నిర్మాణం, మరమ్మతుల పనులు చేపడుతున్నట్లు వివరించారు. పద్మావతి నగర్‌లో అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరడంతో సానుకూలంగా స్పందించి పనులు పూర్తి చేయడం జరిగిందని, స్థానిక ప్రజలకు రాకపోకల సౌకర్యాలు మెరుగుపడ్డాయని అన్నారు.

పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, రహదారులు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయడం లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. నంద్యాల పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయాలు కల్పించేందుకు అమృత్ పథకం కింద సుమారు రూ. 210 నుంచి 213 కోట్ల వరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా పట్టణంలో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాల కల్పన కోసం జలజీవన్ మిషన్ పథకం కింద పనులను చేపట్టినట్లు తెలిపారు.ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, తాగునీరు, విద్యుత్ దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## ప్రజాసేవే ధ్యేయం.. రిజర్వేషన్ అనుకూలిస్తే పోటీకి సిద్ధం! ముత్యాల ప్రసాద్ రావు



పోరుమామిళ్ల, అక్టోబర్ 13 ( పల్లె వెలుగు ): వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం గ్రామ సర్పంచ్ పదవి ఎస్సీ రిజర్వుడ్ అయితే ప్రజల కోరిక మేరకు పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ముత్యాల ప్రసాద్ రావు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా వివిధ సంఘాల్లో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను తన సమస్యలుగా భావించి సంబంధిత అధికారుల దృష్టికి, ప్రభుత్వానికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తున్నానని అన్నారు. గ్రామపంచాయతీలోని వందలాది మంది ప్రజలు తనకు మద్దతుగా నిలిచి పోటీ చేయాలని కోరుతున్న నేపథ్యంలో, వారి అభీష్టం మేరకు మరింత బాధ్యతతో ప్రజాసేవ చేసేందుకు ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నానని ముత్యాల ప్రసాద్ రావు వెల్లడించారు.

## పొదుపు మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు..



పాణ్యం అక్టోబర్ 13 సూర్య న్యూస్ : పొదుపు సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ప్రతి కుటుంబం నుంచి ప్రతి మహిళను లక్షాధికారిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం రుణాలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాణ్యంలోని పొదుపు లక్ష్మి భవనంలో వ్యవసాయ యంత్రాల బ్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రుణాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె సూచించారు.

## కొనిదేడులో నూతన బ్రిడ్జి ప్రారంభం..

### పాణ్యంలో అభివృద్ధి పనులకు శ్రీకారం.

పాణ్యం అక్టోబర్ 13 పల్లె వెలుగు : మండలంలోని కొనిదేడు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా సమస్యగా ఉన్న వద్దెల వాగుపై నిర్మించిన ఆర్ అండ్ బీ నూతన బ్రిడ్జిని మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.అనంతరం పాణ్యం పోలీస్ స్టేషన్ నుంచి పాత ఊరు బజారు వరకు పూర్తయిన ఆర్ అండ్ బీ బీటీ రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే పాణ్యం రైతు బజార్ నిర్మాణానికి రూ.49.50 లక్షల నిధులతో భూమిపూజ నిర్వహించారు ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అన్నపూర్ణేశ్వరి అలంకారంలో
## శ్రీ కామేశ్వరి అమ్మవారు

సింహ వాహనంపై చంద్ర ఘంట దుర్గ అలంకారంలో అమ్మవారీ గ్రామోత్సవం.





**మహానంది, పల్లె వెలుగు:-** మహానంది పుణ్యక్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు శ్రీ కామేశ్వరి అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం సాయంత్రం సింహ వాహనంపై చంద్రఘంట దుర్గగా అమ్మవారు దర్శనం ఇచ్చారు.దుర్గామాత మూడవ స్వరూపం చంద్రఘంట. ఈ తల్లి తన శిరసున అర్ధ చంద్రుడితో ఘంటాకృతిలో ఉండటంవల్ల ఈ పేరు సార్థకమైంది. ఈమె తన పది చేతులలో ఖడ్గం, గద, త్రిశూలం, బాణం, ధనుస్సు, కమలం, జపమాల, కమండలం, అభయముద్ర ధరించి యుద్ధముద్రలో సర్వదా యుద్ధానికి సన్నద్ధమై ఉంటుంది. ఈమె ఘంట నుంచి వెలువడిన ధ్వని భయంకరంగా ఉండిక్రూరులైన రాక్షసులకు, దుష్టులకు భయాన్ని కలిగిస్తుంది. ఈ తల్లిని ఆశ్రయించిన సమస్త సంసారిక కష్టముల నుంచి విముక్తులు అవుతారు. ఇహలోకంలోనేకాక పరలోకంలో కూడా సద్గతి లభిస్తుంది. మూడో రోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి




దాతలచే గణపతి హోమం, రుద్ర హోమం, చండీ హోమ పూజలు ఆలయ పండితులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణ మండపంలో సహస్ర దీపా అలంకరణ సేవ ఆలయ చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి,ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి,దాతలచే వేద పండితులు నిర్వహించారు. అనంతరం అమ్మవారు సింహ వాహనంపై చంద్రగంట దుర్గ అలంకారంలో కొలువై మాడా వీధుల వెంట గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు,అధికారులు, దాతలు అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను
## దర్శించుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి.

### కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు.

ఆలూరు (పల్లె వెలుగు): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బుసినే రామాంజినమ్మ, సోదరుడు బుసినే శ్రీరాములు, యువ నాయకులు బుసినే లక్ష్మీనారాయణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బుసినే చంద్రశేఖర్, బుసినే మధుసూదన్, బుసినే మారుతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మీసేవ పోర్టర్ లలో నిలిపి వేసిన సేవలను పునరుద్ధరించాలి అని మినిస్టర్ బీసీ జనార్ధన్ రెడ్డి కి వినతి పత్రం అందచేసిన మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంఘము

బనగానపల్లె, అక్టోబర్ 13,పల్లెవెలుగు మీసేవ పోర్టర్లలో కులం, ఆదాయధ్రువీకరణ పత్రాలు, రీ -ఇష్యూ పట్టాదారు పాసుబుక్ రీ ప్రింట్, వాటర్ టాక్స్, మరియు జనహీూ (జనన, మరణ)సేవలు నిలిపివేయడం పై "మీసేవ నిర్వాహకుల సంక్షేమ సంఘము "ఆందోళన వ్యక్తం చేసింది, ఈ సేవలను వెంటనే పునరుద్ధరించేలా ముఖ్యమంత్రి దృష్టి కి తీసుకొని వెళ్ళాలి అని కోరుతూ మినిస్టర్ బీసీ జనార్దన్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు గ్రామీణ ప్రాంతాలలో స్మార్ట్ ఫోన్లు, సాంకేతిక పరిజ్ఞానం లేని సామాన్య ప్రజలు అపరిచిత ఆన్లైన్ లింక్ ద్వారా సైబర్ మోసాల బారిన పడుతున్నారని, మరియు రీ -ఇష్యూ ల సేవలు నిలిచి పోవడం లో ప్రధాన ఆదాయం కోల్పోయి వేలాది మీసేవ నిర్వాహక కుటుంబాలు వీధిన పడ్డాయని, ప్రజల భద్రతను నిర్వాహకుల ఉపాధి ని దృష్టిలో ఉంచుకొని మనమిత్ర తో పాటు మీసేవ, ఏపీ సేవ పోర్టర్లను అన్ని నిలిపివేసిన సేవలు పునరుద్ధరించేలా చేయాలనీ విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమం లో రాష్ట్ర మీసేవ అధ్యక్షులు ఎ. తిరుమల నాయుడు,రాష్ట్ర మీసేవ జిల్లా అధ్యక్షులు సయెద్ మహబూబ్ బాషా,రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు గుండం అమర్నాథ్ రెడ్డి,సుధాకర్, సుబ్రహ్మణ్యం, అన్వర్,షఫీ, అల్లిబాషా,రవికుమార్, లక్ష్మీదేవి,భాస్కర్, శివగోపాల్,రవిశంకర్, గౌస్ షాహిన్ తదితరులు పాల్గొన్నారు



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com